క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తిలో అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన అంజయ్య కుటుంబానికి ఆదివారం శ్రీనిధి కో–ఆపరేటీవ్ సొసైటీ ఆధ్వర్యంలో రూ. 10వేలు ఆర్థిక సాయం అందించారు. మృతుడు గత కొంత కాలంగా శ్రీనిధి కో–ఆపరేటీవ్ సొసైటీలో రోజువారిగా పొదుపు చేసేవాడు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు నాగలక్ష్మీ, ఆనంద్‌కుమార్, లింగప్ప, శభానబేగం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మద్దూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 1993–94 బ్యాచ్ పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు ఒకేచోటచేరుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దేవులనాయక్, ముజబుర్ రహమాన్, శివకుమార్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

కొత్తపల్లి: మండల కేంద్రంలోని బొనమ్మ ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు అమ్మవారి నగలు కిరీటం, 21 తులాల వెండి, పెట్టెలో ఉన్న నగదు దోచుకెళ్లారు. గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న మద్దూరు ఎస్ఐ రాంలాల్ ఆలయానికి చేరుకొని దొంగతనం జరిగిన వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయమై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ధన్వాడ: రాష్ట్ర స్థాయి సీఎం కప్ నెట్‌బాల్ పోటీలకు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శివకుమార్, శైలజ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ముజీబ్ తెలిపారు. వీరు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 31డిసెంబర్ నుంచి 2వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనున్నట్లు తెలిపా రు. ఈమేరకు.. విద్యార్థులను అభినందించారు.

నెర్రెలు బారిన సీసీ రహదారి



దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తిలో ఐదేళ్ల క్రితం నిర్మించిన సీసీ రహదారి నెర్రెలు బారింది. రోడ్డు నిర్మాణం చేపట్టిన అనతికాలంలోనే రోడ్డు మధ్యల నెర్రెలు బారడంతో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఆర్‌అండ్ అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టి సౌకర్యం కల్పించాలంటున్నారు. కర్ణాటక సరిహద్దు గ్రామం కావడంతో నిత్యం వందలాది వాహనాల రాకపోకలతోపాటు గ్రామంలో రెండు ప్రధాన కాలనీల మధ్య రహదారి కావడంతో గ్రామస్తులతో రద్దీగా ఉండే రోడ్డు ప్రమాదభరితంగా ఉందని వెంటనే మరమ్మతు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

31న ఉచిత వైద్య శిబిరం

అమరచింత: మండల కేంద్రంలో ఈనెల 31న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంఆర్ఎం ట్రస్టు సభ్యులు సౌజన్యారెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గుండెకు సంబంధించిన ఉచిత వైద్య చికిత్స శిబిరాన్ని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణయ్ నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలతో పాటు ఫ్లెక్సీని విడుదల చేశారు. మండలంలోని గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ కమలాకర్‌రెడ్డి, సుధాంష్‌రెడ్డి, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలు అగ్గిపాలు

- రోడ్లపైనే పంట వ్యర్థాలకు నిప్పుపెడుతున్న రైతులు
- కాలిపోతున్న హరితహారం మొక్కలు
- పట్టించుకోని అధికారులు



వర్కూర్ శివారులో కాలిపోయిన మొక్కలు



గురువలింగం పల్లి గ్రామ శివారులో కాలిపోయిన మొక్కలు

మాగనూర్: రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించేందుకు గత ప్రభుత్వ శ్రీకారం చుట్టిన హరితహారం పథకం అభాసుపాలవుతోంది. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. పచ్చదనం పెంపులో కీలకంగా మారాల్సిన అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ కార్యక్రమం నిర్వీర్యమవుతోంది. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రోడ్డు పక్కన దారికిరువైపులా నాలుగు వరుసల్లో మొక్కలు నాటారు. మండలంలో మాగనూర్, వర్కూర్, నేరడగం, ఉజ్జెల్లి, కొత్తపల్లి, గురువలింగంపల్లి, తళంకేరి, వడ్వాట్, అడవిసత్యారం, కొల్పూర్, మందిపల్లి గ్రామాల్లో రోడ్డు పక్కన కొందరు పంట వ్యర్థాలను తగుల బెట్టడంతో మొక్కలకు నిప్పు తగిలి మంటలో కాలిపోతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన మొక్కలకు చాలా చోట్ల నిప్పు పెట్టడంతో లక్షల నిధులు వృథా అయ్యాయి.

పంట వ్యర్థాలతోనే..

రోడ్లపై పంటను ఆరబెట్టడం, నూర్పిళ్లు అక్కడనే చేయడంతోపాటు పంట దిగుబడుల వ్యర్థాలు అధికంగా వస్తున్నాయి. వాటిని కొందరు రోడ్డు పక్కనే నిప్పుపెట్టడంతో సమీపంలో ఉండే మొక్కలు నిప్పులో కాలిపోతున్నాయి. అంతేకాకుండా రోడ్డు కూడా దెబ్బతింటుంది. మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్డు ఇరువైపులా ఫారెస్టు అధికారుల ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలు నాటారు.

ప్రత్యేకాధికారులు దృష్టిపెడితేనే..

సర్పంచుల పదవీ కాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన రావడంతో వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నోటీసులు అందజేస్తాం..



రైతులు పంట వ్యర్థాలను రోడ్లపై, పంట పొలాల్లో తగలబెట్టి హరితహారం మొక్కలను ధ్వంసం చేస్తున్న అంశం తమ దృష్టికి రాలేదు. అయితే ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌ల ద్వారా వారికి చెబుతున్న మళ్లి అదేవిధంగా వ్యవహరిస్తున్నారు. ఎవరైతే మొక్కలకు నిప్పు పెడుతున్నారో మళ్లీ వారి ద్వారానే మొక్కలు నాటిస్తాం. అలా చేసిన వారికి నోటీసులు జారీచేస్తాం.

– రహ్మతుద్దీన్, ఎంపీడీఓ, మాగనూర్

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ ఆంజనేయులు

నారాయణపేట: ప్రజలు సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ ఆంజనేయులు సూచించారు. ఆదివారం ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రం, మున్సిపాల్ పార్కు వద్ద స్థానిక పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, సీసీ కెమెరాల ఉపయోగం పలు అంశాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికావొద్దన్నారు. లాటరీ తగిలిందని, తక్కువ వడ్డికి లోన్ ఇస్తామని, గిఫ్ట్ ప్యాక్‌లు వచ్చాయని, వాట్సాప్‌లో మెసేజ్ చేసి డబ్బులు పంపమని అడిగితే పంపొద్దన్నారు. మోసపూరిత ఆశలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణ, పీసీ హన్మంతు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడా రంగంలో రాణించాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలోని దాదాపు 245మంది క్రీడాకారులకు తన సొంత ఖర్చుతో క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేశారు. అలాగే రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు వెళ్తున్న సందర్భంగా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఈ నెల 30నుంచి జనవరి 3వరకు జరిగే కరాటే పోటీల్లో క్రీడాకారులు పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, ఎండీ సలాబిన్ ఉమార్, డీవైఎస్ఓ వెంకటేష్, హన్మంతు, చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్, గణేష్‌కుమార్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

మాగనూర్: మండల పరిధిలోని నేరడగం శ్రీ పశ్చిమాద్రి సంస్థన విరక్త మఠం జాతర మార్చి 16, 17, 18వ తేదీలో కొనసాగనున్నట్లు సిద్ధలింగమహాస్వాములు తెలిపారు. జాతర సందర్భంగా 1111మంది ముత్తైదులకు ఒడినింపే కార్యక్రమం, గోపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా వాల్‌పోస్టర్ విడుదల చేశారు. అనంతరం భక్తులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



కోటకొండలో సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుదర్శన్



మోమినాపూర్‌లో..



దామరగిద్దలో..

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆదివారం ఎంపీడీఓ సుదర్శన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు రోజులలో ఇళ్ల సర్వేను పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి చాణిక్య రెడ్డి, సర్వే అధికారులు శ్రీనివాస్, సీసీ విజయకుమార్, అంగన్‌వాడీ టీచర్ బుగ్గమ్మ, అనురాధ, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: ఇందిరమ్మ ఇళ్ల సర్వే సమగ్రంగా చేపట్టాలని పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ అధికారులకు సూచించారు. మండలంలోని మోమినాపూర్‌లో ఎంపీడీఓ నర్సింహారెడ్డితో కలిసి సర్వే కొనసాగుతున్న తీరును పరిశీలించారు. గ్రామంలో 559 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు 350 ఇళ్లను సర్వే చేసినట్లు పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్ తెలిపారు.

దామరగిద్ద: మండలంలోని కార్యదర్శి తిరుపతిరెడ్డి, మద్దెల్‌బీడ్ పంచాయతీ కార్యదర్శి మంజుల ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండి తమ వివరాలను అందించి సర్వేకు సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, మంజుల, సుజాత, మల్టీపర్పస్ వర్కర్లు శివానంద్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ

ఆత్మకూర్: పట్టణంలోని రాజవీధిలో పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి నిర్వాహకులు ఆదివారం విరాళాలు సేకరించారు. వందల ఏళ్ల క్రితం నిర్మించిన పెద్దమ్మ గుడి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో పునర్నిర్మాణానికి స్థానికులు సిద్ధమయ్యారు. ఇందుకుగాను రూ.2 కోట్లు అవసరం అవుతుండడంతో ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.6లక్షలు విరాళాల రూపంలో వసూలు అయ్యాయని, భక్తులు ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరుతున్నారు. జనవరి 18వ తేదీన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు గడ్డమీది శ్రీను, భరత్, బాలకృష్ణ, రవీందర్, బాలు, కురుమూర్తి, నాగేష్, గోపాల్, శివ, అరవింద్, చిన్న, అయ్యప్ప మాలధారులు, తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆరాధనోత్సవాలు



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆదివారం జితమిత్ర రాయుల ఆరాధానోత్సవాలు జయతీర్థుల రమేష్ రావుల ఆధ్వర్యంలో వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, నైవేద్యం, పల్లకిసేవ తదితర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణచేపట్టారు. ఆలయ అర్చకులు నర్సింహాచారి, హరీష్ ఆచార్య, అనిల్ దేశాయి, రాఘవేంద్ర సేవా సమితి సభ్యులు రఘుప్రేమ్ జోషి, సీతారామరావు, రాఘవేంద్ర, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నారాయణపేట రూరల్: మహారాష్ట్రలోని పూణే నగరంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ నేషనల్ అబాకస్ పోటీల్లో నారాయణపేట విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచారు. జిల్లా కేంద్రానికి చెందిన ఏకంగా నలుగురు విద్యార్థులు అబాకస్ సి 4లో చరణ్ ప్రథమ స్థానం, సి 3లో వైష్ణవి ద్వితీయ స్థానం, రిషిక్ మూడో స్థానం, ఖుషి నామాజీ ప్రోత్సాహక బహుమతులు పొందారు. వీరికి నిర్వాహకులు బహుమతులు అందించారు. ఈ మేరకు పట్టణ విద్యావంతులు పలువురు విద్యార్థులను అభినందించారు.

శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వేలాయె..

ఆత్మకూర్: పట్టణ శివారులోని మల్లాపురం క్షేత్రంలో ఈనెల 31 నుంచి జనవరి 5, 2025 వరకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ప్రముఖ వేదపండితుడు వెంకటశేషశర్మ తెలిపారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు వేలాదిగా భక్తులు హాజరవుతారన్నారు. 31న ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఆత్మకూర్‌లో గ్రామోత్సవం, జనవరి 1న దేవత ఆవనం, విశ్వక్సేన, పుణ్యాహావాచం, అంకురార్పణ, కళశస్థాపన, దిక్పాలకపూజ, గణపతి హోమం, 2వ తేదీన స్వామివారికి అష్టోత్తర కళశాలతో మహాస్నానం, అర్చన, సత్యహోమం, 3వ తేదీన సుదర్శణ హోమం, అభిషేకం, వేదపారాయణం, 4వ తేదీన స్వామివారికి కల్యాణోత్సవం, రథోత్సవం, 5వ తేదీన చక్రస్నానం, ధ్వజావరోహణ, స్వస్తి వాచకం, కర్తలకు శేషవస్త్రాలతో వేదాశీస్సులు తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు వేలాదిగా తరలి వచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని, తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.



క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలతో డీసీసీ మాజీ చైర్మన్ కుంభం శివకుమార్‌రెడ్డి

దామరగిద్ద: శారీరక దారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని డీసీసీ మాజీ చైర్మన్ కుంభం శివకుమార్‌రెడ్డి, సునందా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ ప్రసాద్ శెట్టి అన్నారు. ఆదివారం మండలంలోని క్యాతన్‌పల్లిలో మెతుకు ఆంజనేయులు జ్ఞాపకార్థంగా నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ.. క్యాతన్‌పల్లిలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించడం ఆనందంగా ఉందని ప్రసాద్ శెట్టి అన్నారు. టోర్నమెంట్‌లో మొదటి బహుమతిని బాపన్‌పల్లి హనుమాన్ వారియర్స్ జట్టు గెలుపొందగా రూ. 50వేల నగదు, ద్వితీయ బహుమతి సాధించిన మద్దెల్‌బీడ్ చెర్రీ జట్టుకు ట్రోఫితోపాటు రూ. 30వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సదాశివరెడ్డి, ఎస్ఐ రాజు, నాయకులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్, శరణ్య నాయక్, హన్మంతు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గోవిందమ్మకు సన్మానం

నారాయణపేట: ఇటీవలే నూతనంగా ఎన్నికై నారాయణపేట మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కమ్మరి గోవిందమ్మ, సమాఖ్య సభ్యులను ఆదివారం మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్ రెడ్డి సీవీఆర్ భవన్‌లో కలవడంతో వారిని శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, బోయ శరణప్ప, కాంగ్రెస్ నాయకులు కోట్ల రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. ఆదివారం కాంగ్రెస్ మాజీ డీసీసీ అధ్యక్షుడు పేట నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి వీరికి మద్దతు తెలిపి మాట్లాడారు.. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి మీ సమస్యలపై అవగాహన ఉందని త్వరలోనే శుభవార్త వింటారన్నారు. తదనంతరం ఎస్ఎస్ఏ ఉద్యోగులు కుంభం శివకుమార్ రెడ్డికి తమ సమస్యల గురించి వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపాల్ వైస్‌చైర్మన్ హరి నారాయణ, కాంగ్రెస్ నాయకులు గందే చంద్రకాంత్, సంతోష్‌కుమార్, నరహరి, సతీష్ గౌడ్, కోట్ల రవీందర్ రెడ్డి, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేసి విజయం సాధించాలని పార్టీ నాయకులు కెంచె శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం కోటకొండలో గ్రామ స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు పూర్తి చేసుకొని బూత్ కమిటీల ప్రక్రియ పూర్తయిందన్నారు. ఈ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. పార్టీకి ముల స్తంభాలుగా బూత్ అధ్యక్షులు నడుచుకోవాలన్నారు. నరేంద్ర మోదీ పనితీరుని చూసి ప్రజలు బీజేపీ వైపు ఆదరిస్తున్నారని మనమందరం ప్రజల మన్నన పొందేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కొంగరి రాములు, సత్యప్ప, సాకలి రామకృష్ణ, బొక్కీ సాయిలు, వేపూర్ రవి, చెన్నప్ప యాదవ్, ప్రవీణ్, బాలరాజు, నర్సింహులు, భగవాన్ శంకర్ స్వామి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిద్దాం



మాట్లాడుతున్న విభాగ్‌సంఘ్ చాలక్ శ్రీనివాస్‌రెడ్డి

ఊట్కూరు: సనాతన సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షిద్దామని ఆర్‌ఎస్ఎస్ విభాగ్‌సంఘ చాలక్ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆదివారం చిన్నపొర్లలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 150మంది స్వయం సేవకులు గ్రామ పురవీధుల్లో శోభయాత్ర చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలని అన్నారు. హైందవ సంస్కృతి సాంప్రదాయాలను పిల్లల్లో నూరి పోయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఆయన తెలిపారు. అనంతరం యువకులు యోగ, వ్యాయామం, ఆసనాలు, కరాటే ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, రాంరెడ్డి, నర్సింగప్ప తదితర ఆర్‌ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్‌కు పునాదులు తల్లిదండ్రులు, గురువులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లయ్య

నర్వ: విద్యార్థుల భవిష్యత్‌కు తల్లిదండ్రులు, గురువులు ఇద్దరు పునాదులని సరస్వతీ విద్యాపీఠం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పేరెంట్స్.. టీచర్స్ ఇంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాల్యం నుంచే ఆధ్యాత్మిక, విజ్ఞానవంతమైన మార్గం వైపు పిల్లలు నడిచేలా తల్లిదండ్రులు చర్యలుండాలన్నారు. పాఠశాలలో మారుతున్న కాలానుగుణంగా ఆంగ్లబోధనతో పాటు భగవద్గీత పారాయణం వైపు విద్యార్థులకు నడిపిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులకు మంచి నడవడిక, ఉత్తమ మార్గం వైపు పయనించేలా చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. కార్యక్రమంలో విద్యాపీఠం కన్వీనర్ సీతారం, కరస్పాండెంట్ నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌తో ఉత్తమ భవిష్యత్



విద్యార్థులకు సలహాలు ఇస్తున్న రాష్ట్ర కో–ఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి

మరికల్: వివిధ కారణాలతో మధ్యలో చదువులకు స్వస్తి పలికిన వారి భవిష్యత్ కోసం ఓపెన్ స్కూల్ విద్య ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర కో– ఆర్డినేటర్ జి.దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వెంకటసాయి ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆయన ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం చదువులు మానేసిన వారిని ఉన్నత స్థానంలో చూడాలనే లక్ష్యంతోనే ఓపెన్ స్కూల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించిన వారు కూడా ఉన్నారని తెలిపారు. ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు పదో తరగతి, ఇంటర్‌లో క్రమం తప్పకుండా 30 పీసీపీ క్లాసులకు గాను ఖచ్చితంగా 24క్లాసులకు తగ్గటు హాజరు శాతం ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయుల, అసైన్‌మెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. కో– ఆర్డినేటర్ శివయ్య, నారాయణపేట జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనపై గళం విప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న బి. రాము

నారాయణపేట: మోదీ పాలనలోని మొండి వైఖరికి వ్యతిరేకంగా దేశమంతటా రైతాంగం గళం విప్పాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు బి.రాము అన్నారు. ఆదివారం స్థానిక భగత్‌సింగ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. మోదీ పాలనలోని వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా చారిత్రాత్మక రైతు ఉద్యమంలో ప్రముఖ నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నవంబర్ 26నుంచి ఆమరణ నిరాహార దీక్షలో ఉన్నారన్నారు. రైతాంగం చట్టబద్ధమైన డిమాండ్లను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆయన కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.